క్లుప్తంగా

దసరా వేడుకలకు మున్సిపల్‌గ్రౌండ్ ముస్తాబు



అంబర్‌పేట: దసరా వేడుకలకు అంబర్‌పేట మున్సిపల్‌గ్రౌండ్ ముస్తాబయ్యింది. ప్రతి ఏడాది అంగరంగ వైభంగా నిర్వహించి దసర ఉత్సవాలకు ఈ ఏడది నిర్వహించేందుకు నిర్వహాకులు సన్నాహాలు చేస్తున్నారు. అంబర్‌పేట దేవస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో దసర వేడుకలు, రావణ దహనం వంటి కార్యక్రమాలను వైభంగా నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో వేలాది మంది వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బుధవారం నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు.

వరద బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక చొరవ



వరద బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: మూసి వరద బాధితులకు అన్ని విధాల ఆదుకునేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలిపారు. బుధవారం అంబర్‌పేట న్యూ అంబేడ్కర్‌నగర్‌లో మూసీ వరద బాధితులకు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, అధికారులతో కలిసి ఆయన బియ్యంతో పాటు పలు సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... భారీ వర్షాలతో మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వారని అదుకునేందుకు అన్ని విధాల కృషి చేస్తానన్నారు. యుద్ధ ప్రతిపాదికన వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు ఆరోగ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అన్వర్ హుస్సేన్, డిప్యూటీ తహశీల్దార్ బల్‌రామ్, స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ, అంగన్వాడీల సేవలు అభినందనీయం



దసరా కానుకగా చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్


చిక్కడపల్లి: జీహెచ్‌ఎంసీ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్ల సేవలు అభినందనీయమని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. బుధవారం అంగన్వాడీ, అశావర్కర్లకు, జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, ఎస్‌ఎఫ్‌ఏలకు దసరా కానుకగా మహిళలకు చీరలు, పురుషులకు కానుకలను ఆమె అందజేశారు. సిబ్బందితో పాటు డివిజన్ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, నేతలు శ్రీకాంత్, దామోదర్, పి.నర్సింగ్‌రావు, ఎం.ఉమేష్, శివకుమార్, ఆనంద్‌రావు, లక్ష్మణ్‌యాదవ్, డి.కుమార్, అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్, ప్రశంత్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో డీబీపీకి అగ్గిపెట్టె గుర్తు

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో దళిత బహుజన పార్టీకి ఎన్నికల కమిషన్ అగ్గిపెట్టె గుర్తును కేటాయించామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ప్రజల జీవన సామాజిక సమస్యలు పరిష్కారం కావాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. అగ్గిపెట్టె గుర్తుపై ఓటు వేసి దోపిడీ కుల పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానల్లో దళిత బహుజన పార్టీ తరపున అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు.

విద్యుద్దీపాల వెలుగులో కాచిగూడ రైల్వేస్టేషన్

కాచిగూడ: దసరా (విజయ దశమి) పండుగ సందర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్‌ను రైల్వే అధికారులు అందంగా తీర్చిదిద్దారు. ప్రకాశవంతమైన విద్యుద్దీపాలతో స్టేషన్ ముఖద్వారాన్ని ఏర్పాటు చేయడంతో అందరినీ ఆకర్షిస్తోంది.





రాజరాజేశ్వరిగా శంకరమఠం శారదాంబ

మహిషాసురమర్దిని అలంకరణలో అంబర్‌పేట మహంకాళి, బతుకమ్మకుంట మైసమ్మ, న్యూరామాలయ సరస్వతీమాత







జయ జయ హే మహిషాసురమర్దిని రమ్యకపర్దిని శైలసుతే..!

భక్తిశ్రద్ధలతో దేవీ శరన్నవరాత్రుల చివరి రోజు పూజలు | మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో కనులపండువగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకున్నారు. నవమి సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. పూజలతో ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. దేవీ శరన్నవరాత్రుల చివరి రోజు కావడంతో ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. బుధవారం (నవమి) అమ్మవార్లను మహిషాసురమర్దినిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గురువారం దసరా వేడుకలను పురస్కరించుకొని ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సాయంత్రం కార్యాలయాలు, దుకాణాలు ఆయుధ పూజకు ముస్తాబవుతూ కనిపించాయి.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



అంబర్‌పేట డివిజన్‌లో జరిగిన శరన్నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



ముషీరాబాద్ మహంకాళికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నరేష్, నాగభూషణంగౌడ్



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ పూజలో బీజేపీ నేత వినయ్‌కుమార్



చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, చైర్మన్ జానకి, ఈఓ దేవనాథం





ఎమ్మెల్యే కాలేరు వ్యాఖ్యలు అభ్యంతరకరం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం సెంట్రల్ సిటీ నగర కార్యదర్శి వెంకటేశ్

అంబర్‌పేట: సీపీఎం నాయకులు మహేందర్‌పై ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సీపీఎం సెంట్రల్ సిటీ నగర కార్యదర్శి ఎం.వెంకటేశ్ హెచ్చరించారు. బుధవారం బాగ్‌అంబర్‌పేటలో ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు మహేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పేదలకు బియ్యం పంపిణీ విషయంలో జరిగిన వివాదంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహనం కోల్పోయి సీపీఎం నాయకుడు మహేందర్‌పై అనుచిత వ్యాఖ్యలతో పాటు బెదిరింపు ధోరణితో వ్యవహరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పేదల పక్షాన తాము నిరంతరం పోరాడుతూనే ఉంటామని తెలిపారు. ఇలాంటి బెదిరింపులకు సీపీఎం నాయకులు భయపడరనే విషయాన్ని ఎమ్మెల్యే గమనించాలని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వ్యవహరించిన తీరుపై తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే చేసే అవినీతి, ఆగాడాలను తాము వెలుగులోకి తీసుకువచ్చి ప్రజల్లో ఎండగడుతామని అన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాదిరిగా పార్టీలు మారి ఊసరవెల్లిలా తాము కాదన్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే వాఖ్యాలు ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పకపోతే ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం నాయుకలు సుబ్బారావు, షబానాబేగం, అఖిల్, నాగేందర్, శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కా రామయ్యకు పద్మ విభూషణ్ ఇవ్వాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య

నల్లకుంట: ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యకు పద్మ విభూషణ్ ఇచ్చి సత్కరించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మహాత్మా గాంధీ 156వ జయంతి సందర్భంగా ప్రముఖ గాంధేయవాది, రచయిత డాక్టర్ నాగసూరి రచించిన 'గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ' పుస్తకాన్ని బుధవారం నల్లకుంట విజ్ఞానపురి కాలనిలో చుక్కారామయ్య నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ.. అమెరికాలోని సిలికాన్ వాలీ తెలుగు విద్యార్థులతో నిండిపోవడంలో చుక్కా రామయ్య కృషి ఎంతో ఉందని అన్నారు. తెలంగాణ గ్రామాల విముక్తి కోసం చుక్కా రామయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారని ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. పుస్తక రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ.. గాంధీని విడదీసి భారతదేశాన్ని చూస్తే కొత్తగా, మనది కాదన్నట్లుగా కనిపిస్తుందని చెప్పారు. తెలంగాణ పబ్లికేషన్స్ వ్యవస్థాపకుడు కోయ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయండి

18 బీసీ సంఘాల సమావేశంలో ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి



బీసీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులు పోటీకి సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బుధవారం బీసీ భవన్‌లో 18 బీసీ సంఘాల సమావేశం ఆర్.కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో సుదీర్ఘంగా 42 శాతం రిజర్వేషన్లు రక్షించుకోవడానికి అందరం కృషి చేయాలని కోరారు. బీసీలు చేసిన ఎన్నో పోరాటాల ఫలితంగా 42 శాతం రిజర్వేషన్లు సాధించామని ప్రభుత్వం స్పందించి జీవో 9 జారీ చేశారన్నారు. దీన్ని ప్రకారం ఎన్నికలు జరపడానికి దీనిని కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నేతలు జుగ్గ కృష్ణ, సి.రాజేందర్, కోలా జనార్ధన్, బర్క కృష్ణ, కోట్ల శ్రీనివాస్, జల్లపల్లి అంజి, మణికంఠ, రాజునేత, అనంతయ్య, గోరిగే మల్లేష్‌యాదవ్, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలి



గుజ్జ సత్యం

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా హైకోర్టులో వేసిన పిటిషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. కోర్టులో పిటిషన్ వేసిన వారితో మాట్లాడి విరమించుకునేలా ప్రభుత్వం చూడాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా రాష్ట్రంలో 54 శాతం ఉన్న బీసీలకు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 42 శాతానికి పెంచిందని తెలిపారు. దీంతో అట్టడుగున ఉన్న బీసీ కులాలకు స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా చట్ట సభలలో ప్రాతినిధ్యం దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. తద్వారా బీసీలకు సామాజిక న్యాయం లభిస్తుందన్నారు.

రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి కృషి చేయండి



రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌కు వినతి పత్రం

కాచిగూడ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బీసీ బిల్లులకు రాష్ట్ర గవర్నర్ అమోదం తెలిపే విధంగా కృషి చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. బుధవారం బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్ర గవర్నర్ అమోదం అత్యవసరమని అన్నారు. అందువల్ల గవర్నర్‌పై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అసెంబ్లీలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల బిల్లులకు బీజేపీ ఇప్పటికే మద్దతు తెలిపిందని ఆయన గుర్తు చేశారు. బీసీ బిల్లులకు రాజ్యాంగ భద్రత కల్పించే బాధ్యత బీజేపీ పైన ఉందని అన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



భోలక్‌పూర్‌లో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న బ్రహ్మయ్యచౌదరి

ముషీరాబాద్: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర ప్రముఖ్ బ్రహ్మయ్యచౌదరి అన్నారు. బుధవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతజయంతి ఉత్సవాలలో భాగంగా భోలక్‌పూర్ హౌస్ వద్ద నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్‌ఎస్‌ఎస్ వంద ఏళ్లల్లో అనేక సేవా కార్యక్రమాలు, హిందూ ధర్మ పరిరక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు దేశ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు బొగ్గు మురళీ, భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు రాజశేఖర్, విశ్వేశ్వర్, బబ్లూ, బిజ్జి కనకేష్‌కుమార్, మణికంఠం, శివ పాల్గొన్నారు.

నేడు జమ్మి పూజ

ముషీరాబాద్: రాంనగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయం బాలాజీనగర్‌లో దసరా జమ్మిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాంనగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుధాకర్‌గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.రాజశేఖర్‌గుప్తా, నేతి సత్యనారాయణ, వై.శ్రీనివాస్, వై.శేఖర్, వి.సత్యవర్ధన్, ఎస్.శ్రీనివాస్, అంజయ్య, శ్యామల శ్రీనివాస్, సి.హెచ్.ప్రకాష్ తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య కుటుంబ సభ్యులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.



చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ చేస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్, సీఐ రాజునాయక్, డీఐ శంకర్ మాలోతు



సాయికృష్ణ న్యూరో ఆస్పత్రిలో నిర్వహించిన ఆయుధ పూజలో ఎండీ డా. రాంరెడ్డి, డా. పీజీ రెడ్డి

భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ

దసరా పండుగను పురస్కరించుకొని బుధవారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఆయుధ పూజలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్లు, కార్యాలయాలు, ఆస్పత్రులలో జరిగిన ఈ పూజలో సిబ్బంది పాల్గొన్నారు. మిగతా వారు గురువారం ఆయుధ పూజలు పెద్ద ఎత్తున చేపట్టనున్నారు.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఆయుధ పూజలో ఇన్‌స్పెక్టర్ రాంబాబు



నారాయణగూడ జలమండలి కార్యాలయంలో ఆయుధ పూజలో మొగుళ్ల రాజిరెడ్డి